
కరకర పొద్దుపొడిచి సర సర మెట్లమీద పాకుతోంది. ఏడింటికి ఏడు నిమిషాలు తక్కువుంది. 'సెవెన్ హిల్స్ హెయిర్ కటింగ్ సెలూన్' మెట్లను మూడు అంగల్లో ఎక్కేసి యాంత్రికంగా తాళాలు తీశాడు ఓనరు యాదగిరి. అది పెద్ద బజారు. రోడ్డు గుండెల మీద జనసంచారం మొదలైంది.



# గుండె చప్పుళ్లు

ఐతా చంద్రయ్య

ఏడు గుర్రాల రథమ్మీద సూర్యుడెట్లా ఉరుకుతాడో ఏమో... అనుకుంటూ యాదగిరి తన వెంట లోపలికి చొచ్చుకొచ్చిన లేత కిరణాలను తన్మయంగా చూశాడు. ఏడు నిమిషాల్లో షాపునంతా ఊడ్చేసి, అద్దాలు – సీట్లు తుడుస్తుంటే – తానో గ్రాడ్యుయేటుననీ, బ్యాంకు అప్పుతో షాపు ప్రారంభించానని గుర్తుకు రాలేదు. ఐదేళ్ల క్రితం సెవెన్‌హిల్స్ సెలూన్‌ను ఐదు సీట్లతో రంగరంగ వైభోగంగా ప్రారంభించాలనుకున్నాడు. కాని... అపరిమితమైన స్థలాభావం, పరిమితమైన ఆర్థిక వనరులు ఎదురునిలిచి నాలుగు సీట్లతో సరిపెట్టుకొమ్మన్నాయి. రాజీ జీవితానికి రంది లేదన్నారు గదా!

నలుగురు పనివాళ్లు, తోడుగా తాను.. నాలుగేళ్లలో బ్యాంకు అప్పు తీరిపోయింది. కలిసొచ్చే అదృష్టానికి నడిచొచ్చే కొడుకు పుడతాడట... అంతా పైవాడి దయ. లేకపోతే.. ఉద్యోగం కోసం ఊరూరా తిరిగితే దొరికేదా! దొరికినా 'గొర్రెతోక బెత్తెడే' అన్నట్టు జానెడు జీతంతో మూరెడు జీవితం గడపాలి... బానిస బతుకులో ఎన్నో బాధలుంటాయి

గోడగడియారం ఏడు గంటలు కొట్టింది.

''ఏం యాదగిరీ! పప్పన్నం ఎప్పుడు పెట్టిస్తున్నవటా!'' పాతగిరాకీదారు లోపలికొచ్చాడు. పెరిగిన గెడ్డాన్ని చూపిస్తూ అద్దం ముందు కుర్చీలో కూచున్నాడు.

''ఎప్పుడంటే అప్పుడే సార్. అయినా... నాకు నచ్చిన అమ్మాయి దొరకాలె గదా సార్!'' నల్లని మీసంకట్టు కింద సన్నని చిరునవ్వు మెరిసింది. మెత్తని బ్రష్ గిరాకీదారు గెడ్డానికి చకచకా క్రీము దట్టిస్తోంది. అద్దంలోనే యాదగిరిని చూస్తూ

''అవునవును. పెళ్లంటే నూరేళ్ల పంటగదా! నీ వయసు పాతికేళ్లేగదా... పసందైన అమ్మాయినే చేస్కో'' సర్దుక్కూచున్నాడు.

మరో ఇద్దరు గిరాకీదారులొచ్చి వెయిటింగ్ బెంచీ మీద కూచున్నారు. ఒకరు దినపత్రిక, మరొకరు వారపత్రిక తిరగేస్తున్నారు. మధ్యలో సరదా కబుర్లు...

ఎనిమిదికల్లా ముగ్గురు పనివాళ్లొచ్చారు. ఇంకొకరు రావాలి. ఆప్యాయత, స్నేహగుణం పనివాళ్లను అజమాయిషీ చేస్తాయని యాదగిరి నమ్మకం. విసుగూ విరామం లేకుండా తాను పనిచేస్తూ వాళ్లతో పనిచేయించడం అలవాటైంది. లోకాభిరామాయణానికి జోకాభిరామాయణం జోడించి గిరాకీదార్లకు మనోల్లాసం కలిగించడం అతని ఆప్యాయత.... అదొక హాబీ.

''యాదగిరీ! నీ మాటల్ల ఏం మాయ వుందోగాని ఎప్పుడూ నీ సెలూన్‌కే రావాలన్పిస్తుందయ్యా'' అన్నాడో గిరాకీదారు – కటింగ్‌కోసం తల వంచి. అటు కత్తెర పని ప్రారంభించగానే ఇటు

''నా మాయ కాదు సార్. అది మీ దయ, అభిమానం'' అంటూ క్యాష్ కౌంటర్ మీద కూచున్నాడు. తొమ్మిదిన్నరైంది.

పదిహేను రోజుల క్రితం పనిలో చేరిన సత్తయ్య సీటు ఖాళీగా వుంది. ఆ మానవుడింకా ఎందుకు రాలేదో!

''నమస్తే యాదగిరి సాబ్!'' సత్తయ్య మెట్లెక్కుతున్నాడు. ఓ చేతిలో ధోవతి అంచు వుంది. మరో చెయ్యి గాల్లోకి లేచింది. మాసిన గెడ్డం, ముతక ధోవతి, చిల్లుల గల్లా షర్టు ... మొహమ్మీద కళ లేదు. రాళ్లుమోసి అలసిపోయినట్టుంది వాలకం. మోచేతుల్ని, మోకాళ్లను తడుముకుంటూ లోపలికొచ్చాడు. అప్పటికే తన సీటుమీద కూచుంటున్న గిరాకీదారునడిగాడు.

''కట్టింగా, షేవింగా?'' నవ్వాలనే ప్రయత్నం విఫలమైంది.

యాదగిరి క్యాష్ కౌంటర్‌కు పరిమితమయ్యాడు. కత్తెర్ల కరకరలు, షేవింగ్ బ్లేడ్ల సురసురలతో పనిసాగిపోతోంది. ఎవరి పనిలో వారున్నారు.

మధ్యాహ్నం ... గిరాకీ తక్కువ. నలుగురు పనివాళ్లలో ముగ్గుర్ని లంచ్‌కు పంపించాడు యాదగిరి. మిగిలింది తానూ, సత్తయ్య.

గిరాకులెవ్వరూ లేరు.

''ఏంది సత్తన్నా! ఇయ్యాల్లగింత ఆలస్యంగ వచ్చినవు. ఏదన్నా అర్జంటు పనిమీద పోయినవా?'' సున్నితంగా అడిగాడు యాదగిరి. పెదాల మీద మందహాసముంది. మందహాసములో మందలింపు మిళితమైంది. సత్తయ్య నిట్టూర్చి గిరాకుల బెంచీమీద కూచున్నాడు. క్షణంలో మొహం, మబ్బులు కమ్ముకున్న ఆకాశంలాగైంది.

''చెప్పన్నా... ఏదన్నా పరేషానా? మనిద్దరమే ఉన్నం చెప్పు''.

''ఆ... అదీ...!''

''చెప్పు. ఫరవాలేదు''.

''ఏం లేదు కానీ...'' లేచి నుంచోబోయి ఆగి కూచున్నాడు సత్తయ్య. ''ఓ వెయ్యి రూపాయల అప్పు కావాలన్నాను గదా! ఇయ్యాల్ల ఇస్తవా! నెల కింత జీతంల కటింగు చేసుకో...''

నాల్రోజుల నుండి అప్పు అడుగుతున్నాడు సత్తయ్య. తాగి తందనాలాడతాడేమో! పెద్దవాడు, ముగ్గురాడపిల్లలు. ఊళ్లో గిరాకులు లేవన్నాడు. తనిచ్చిన సైకిల్‌మీద రోజూ సాయంత్రం ఊరెళ్లి, పొద్దున వస్తున్నాడు.

''ఒక్కసారే వెయ్యి రూపాయలెందుకూ? సగం బస్తా బియ్యం కావాలంటే ఉద్దెర ఇప్పిస్తా, సరేనా?''

''ఊహు!''

''మరి... ఒక్కసారే వెయ్యి రూపాయలెందుకంటే చెప్పవు. ఎట్లా?'' గొంతు స్థాయి కొంచెం పెరిగింది.

సత్తయ్య మొహం సత్తుపిండి ముద్దలాగైంది. లోలోపల బాధపడుతున్నాడనీ, ఏదో చెప్పలేకపోతున్నాడనీ అతని నేలచూపులే చెబుతున్నాయి. కారణం కనుక్కోవాలనే పట్టుదల పెరిగింది. దానికి ఆసక్తి జోడైంది.

''చెప్పరాని పనా?''

''చెప్తే...'' తల మెల్లిగా పైకి లేచింది. ''చెప్తే సిగ్గుపోతది''. చిల్లి కనబడకుండా గల్లా సవరించుకున్నాడు. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది.

కారణం ఖచ్చితంగా తెలుసుకోవాలనేఆసక్తి మరింత పెరిగింది యాదగిరిలో.

''మనం ఒక్కారివాళ్లం. నన్ను పరాయిగా భావించక సంగతేందో చెప్పెయ్ సత్తన్నా!'' ఆప్యాయంగా అడిగాడు. సత్తయ్య కళ్లల్లో దైన్యం అలాగే వుంది.

''నా రెండో బిడ్డ భవానిని బాంబేల అమ్మె



## ఎంత పొట్టి కారో...!

ఇంత పొట్టి కారుని చూస్తుంటే ఎంతో ముచ్చటగా వుంటుంది. ఈ కారులో ఒక్కసారిగా అయినా ప్రయాణం చేస్తే ఎంతో సరదాగా, హాయిగా, ఆనందంగా వుంటుంది. రకరకాల రంగుల్లో అమెరికా వీధుల్లో ఇవి తిరుగుతాయి. ఇందులో ఇద్దరే కూర్చోవచ్చు. ఇది ఎంత స్పీడుగా వెళ్ళినా, బెదురు అక్కరలేదు. ఇలాంటి కార్లు ఎక్కువగా టూరిస్టులు ఉపయోగిస్తారు. శుభకార్యాలకు, సరదాగా తిరగడానికి అద్దెకిస్తారు. అమెరికాలో ఇలాంటి కార్లు అంటే ఎంతో క్రేజీ.

య్యాలె. ఆ ఖర్చులకోసం...'' తల తిరిగి నేలకు వాలింది.

కత్తెరతో కుత్తుక నుత్తరించినట్టనిపించింది. నెత్తి మీద నాటుబాంబు పేలినట్టు నోరు దెరిచాడు. ''ఆ... కన్నకూతుర్ని అమ్ముతవా! నువు మనిషివే నా?'' తనను తాను నిగ్రహించుకోలేకపోయాడు. భూకంపం వచ్చి క్యాష్ కౌంటర్ కదిలిపోతున్నట్టు – కౌంటర్‌మీద ఒరిగిపోయాడు. సత్తయ్య పీక కొరి కెయ్యాలనిపిస్తోంది.

''మరేం జెయ్యాలె! ఊర్లె గిరాకిలు లేవు. పెద్దలు సంపాదించిన ఆస్తుల్లేవు. రెండేండ్ల కింద పెద్దమ్మా యిని అమ్మేస్తే వచ్చిన పదివేల రూపాయల్తోని సంవత్సరం గడిచింది. అటెన్క మల్లా బట్టకు, పొట్టకు అప్పులైంది. నువు దయదల్చి నౌకరిచ్చి నవు. ఐదారువేల రూపాయల అప్పుంది. దీన్ని అమ్మేసి అప్పుదీరుస్తా. అటెన్క నెలజీతమ్మీద బతు కుతా. కన్నబిడ్డను అమ్ముడు కసాయితనమే కాని ఇంకేదన్నా అమ్ముదామంటే నా దగ్గర ఇంకేమీ లేదుగదా! అంతా ఆ దేవుని లీల అనుకుంటు న్నా...'' కళ్లల్లో పల్చటి తెర మెరుస్తోంది. అది యాదగిరి గుండె నరాలను పిండేస్తోంది.

ఇది సాధ్యమా! అంగడిలో గొంగడిలా కన్నకూ తుర్ని అమ్మడమా! అసహజం... అన్యాయం... అక్రమం... ''నువు తండ్రివి కావు, తలారివి'' అనా లన్పించింది. ప్చ్...! ఆలి లేనోడు... పిల్లల ఆకలి అంగలార్పుల్ని చల్లార్చలేనోడు... దైవోపహతుడు... వెచ్చని నిట్టూర్పు వెలువడింది.

చాయ్ తాగేందుకు కూడా ఆటోలల్ల పట్నమొ చ్చిపోతున్న పల్లెటూరి జనాలు షేవింగ్, కటింగులు ఊళ్లో చేయిచుకుంట లేరు. పనిలేకపోతె పైసల్లేవు. పైసల్లేనోడు పాపాత్ముడైపోతున్నడు.... అయ్యో జెష్టక్కా! ఎంత పంజేస్తున్నవే! దరిద్రదే వతా...! శాంతిస్తున్న ఉక్రోశం మనసు పొరల్లో ఆక్రోశించింది.

''కన్నకడుపుకు... అమ్మిన అమ్మాయి మల్లా గుర్తుకొస్తలేదా?'' నిటారుగా కూచుంటూ అడి గాడు.

''వస్తుంది. గుర్తుకొచ్చినప్పుడు కడుపుల పేగుల్ని కలెబెట్టి పిండినట్టయితది. ఏ జన్మల ఏం పాపం జేసిన్నో... ఆ బాధను మరిచిపోవాలనే సారా పాకెట్ తాగుతా...'' ధోవతి కొసతో కళ్లద్దుకు న్నాడు. ఎదురుగా పార్థసారథి బొమ్మ గోడమీద కన్పించింది.

అమ్మాయిలను అమ్మేబదులు ఇల్లు అమ్మొచ్చు గదా!''

''ఇల్లా!'' నిర్వేదం నిట్టూర్చింది. ''ఇల్లు ఎప్పుడో అమ్ముడుపోయింది. అమ్మిన ఇంట్లనే కిరాయి కుంటున్న. గా బాధ భరించలేకనే నా భార్య ఉరేసు కుని చచ్చిపోయింది''

మరో షాక్. చూపుల్లో చురచుర. ఇంకేమీ అడగా లన్పించలేదు. ''చూద్దాం. వారం రోజులాగు'' అప్పుడే లోపలికొస్తున్న గిరాకీదారును కళ్లతో చూపించాడు.

''కానీ...'' సత్తయ్య కదలలేదు. అప్పుల వాళ్లు చుట్టుముట్టి చెప్పులతో చెంపలు వాయిస్తున్నట్టు... భయం... ''ఓ వారం రోజులు ఊరికెల్తానయ్యా''

వచ్చిన గిరాకిదారుడు కుర్చీలో కూచుండి మొహాన్ని అటూ ఇటూ తిప్పుతూ అద్దంలో చూసు కుంటున్నాడు.

''ఏ ఊరికి?'' అనుమానం గోకుతోంది యాదగి రిని.

''హైదరాబాదుకు''

''ఎందుకూ?''

''మనూర్లె కనబడితె అప్పులోల్లు బతకని య్యరు. హైద్రాబాదుల మా దోస్తులున్నరు''

''సరే.. సాయంత్రందాకా పనిచేసుకుని పో...''

సత్తయ్య లేచి నుంచున్నాడు. అడుగు ముందుకె య్యలేదు.

''ఇంకేమిటటా?'' కొద్దిపాటి చిరాకు.

''హైద్రాబాదుకు బస్సు కిరాయి''

బస్సు కిరాయికి డబ్బులడుక్కొని బార్‌షాపుల దూరుతాడేమో... అయినా నమ్మక తప్పలేదు.

''సరే. సాయంత్రం పోయేటప్పుడు వంద రూపాయలిస్తాలే.''

ఇహ సంతోషంగా వెళ్లి షేవింగ్ పని ప్రారంభి స్తాడనుకున్నాడు. కాని... సత్తయ్య కదలలేదు. తల పైకిలేచింది. కళ్లు కడిగిన ముత్యాల్లాగున్నాయి. తననే తదేకంగా చూస్తున్నాడు.

''ఇయ్యాల్ల బుధవారం. మల్లా బుధవారం పొద్దుగాల్ల మీ ఇంటికొస్తా, పైసలకోసం'' అంటూ గిరాకిదారు దగ్గరికెళ్లాడు.

''షేవింగా, కటింగా'' అడిగాడు.

''రెండూ...'' చిరునవ్వు. సత్తయ్యాగూడా నవ్వాడు.

యాదగిరి భౌతికంగా సెలూన్‌లో వున్నా మాన సికంగా మరెక్కడో వున్నాడు... ఎవడో ఎత్తుకుపో యిన కూతుర్ని తిరిగి తెచ్చుకున్న తండ్రులున్నారు. ప్రేమ వ్యవహారంలో లేచిపోయి, మోసపోయి సానికొంపల కమ్ముడుబోయిన కూతుర్ని కాపాడి ఇంటికి తెచ్చుకున్న తండ్రులున్నారు. పేగు బంధం అలాంటిది. కానీ... సత్తయ్య లాంటి తండ్రులనేమ నాలి? ... క్షవరం కత్తెరతో మెదడు నరాలను కత్తిరి స్తున్నట్టు అన్పించింది.

నాలుగింటికే సత్తయ్య చేతిలో వంద రూపాయ లుంచి పంపించేశాడు. సెలూన్ మూసేసి హీరో హోండా ఎక్కేశాడు. అరగంటలో సొంతూరులో, సత్తయ్య ఇంటిముందున్నాడు. ఆ ఇల్లు... చల్లని వాతావరణం చూసి పదేళ్లయింది. చిన్నప్పుడు సత్తయ్య పెద్దమ్మాయి సుశీలతో కలిసి ఒకే తరగ తిలో చదువుకున్నాడు. ఆ తర్వాత తాను సైతం హైస్కూలు చదువుకోసం పట్నం వెళ్లడం, సొంతూరికొచ్చినా రెండ్రోజులకంటె ఎక్కువ ఉండ కపోవడం... గుర్తుకొస్తున్నాయి.

ఇంటిముందున్న వేపచెట్టు కొమ్మలు విస్తరించి మహావృక్షంగా మారింది. వేపచెట్టు కింద హీరో హోండా ఆగింది. మానసవీణ జతులు సవరి స్తోంది. అభిమానం, అనుమానం, ఉల్లాసం, ఉత్సాహం... మౌనరాగాలు వినిపిస్తున్నాయి. కాళ్లు ముందుకు కదిలాయి. కళ్లు జాగ్రత్తపడుతున్నాయి.


వసారాలో యువతి కూచునుంది. సామన ఛాయ, ముద్దబంతి ముఖము, చారెడేసి కళ్లు. పొడ గాటి ముక్కు... కనకాంబరాలను మల్లెపూలతో కలిపి మాల అల్లుతోంది.

చిన్నగా దగ్గాడు. వేటగాణ్ణి చూసి బెదిరిన లేడిలా దిగ్గున లేచి నుంచుంది. ''ఎవరూ? ఏం

## ఎంత పొడుగు కారో...

ఇంత పొడుగ్గా వున్న కార్లు ఎక్కువగా అమెరికాలో జాన్ కెన్నడీ ఎయిర్‌పోర్ట్ వద్ద వుంటాయి. ఈ కారు పేరు 'లిమోజీ'! రకరకాల రంగుల్లో కళ్లు మెరుస్తున్నట్లు కనబడ తాయి. ఈ కారులో డజనుమంది కూర్చోవచ్చును. ఇందులో చిన్న టీ.వీలు, టెలిఫోన్, టేప్ రికార్డర్ మొదలై నవి వుంటాయి. వివాహాలకు, పెద్దవాళ్లను తీసుకురావ డానికి అద్దెకి ఇస్తారు. ఈ కారులో ప్రయాణం చేస్తే విమా నంలో ప్రయాణం చేస్తున్నట్లు అనుభూతి కలుగుతుంది.

సేకరణ: పి.ఎ. ప్రభాకర్‌దత్తు



కావాలె?'' వోణీ సవరింపు.

''మాది ఈ వూరే'' తనను తాను పరిచయం చేసుకుని ''మీ అక్క సుశీల, నేను కలిసి చదువుకున్నాము'' వివరణ ఇచ్చి ''నీ పేరు భవాని కదూ'' అడిగాడు ధైర్యంగా.

''అవును... రా... కూచో!'' భవాని ముఖారవిందం విచ్చుకుంది. ''మా చెల్లె సుమతి ఎటుబోయిందో'' గొణుక్కుంది.

''ఇప్పుడు మీ నాన్న సత్తయ్య నా షాపులనే పంజేస్తున్నడు''

''అట్లనా!'' అటూ ఇటూ చూస్తూ లోపలికెళ్లి మంచినీళ్ల గ్లాసు తెచ్చి చేతికందించింది. గాజుల సవ్వడి... గమ్మత్తుగా ఉంది.

చెక్క కుర్చీలో కూచుంటూ గ్లాసెడు నీళ్లు గటగటా తాగేశాను.

''రోజూ మా నాన్న ఇంటికొచ్చేసరికి రాత్రి అవుతుంది. అప్పుడప్పుడు తాగొస్తున్నడు. షాపుల ఎట్ల పంజేస్తున్నడో ఏమో'' మాటలు వినసొంపుగా వున్నాయి. కపటంలేని మనసులా ఇల్లు - నిరాడంబరంగా, శుభ్రంగా వుంది.

''మీ నాన్న ఇయ్యాల్ల హైద్రాబాదుకు పోయిండు'' యాదగిరి చూపులు గోడకు వేళ్లాడుతున్న ఆడపము మీదున్నాయి.

''అట్లనా! అది మా నాన్నకు మామూలే. ఎవ్వలకు చెప్పకుండా ఎటెటొ తిరిగొస్తడు'' నేలమీద కూచుని తిరిగి పూలదండ అల్లుతోంది. ''అమ్మ చచ్చిన తర్వాత మేము ఆగమైపోయినం'' నుదుటి మీది ముంగురులు గాలికి ఉయ్యాల లూగుతున్నాయి. పొడగాటి జడ వక్షస్థలమ్మీద వంకలు తిరిగి నల్లనాగులా కనబడుతోంది. జడకింది గులాబి రంగు వోణీ వయసు పొంగుల ఉనికి తెలుపుతోంది.

''మీ అక్క సుశీల ఇప్పుడెక్కడుంది?'' కావాలనే అడిగాడు. చూపులు బొట్టు నుండి చిటికెన వేలు దాకా తడుముతున్నాయి.

''మా అక్క సింగపూర్‌ల ఉద్యోగం చేస్తుంది. నన్నుగూడ అక్కడికే పంపిస్తనన్నడు మా నాన్న'' మురిపెం ఛాయలు బుగ్గల్ని మెరిపిస్తున్నాయి.

ఓహో! మీకట్లా చెప్పి నమ్మిస్తున్నడా! కన్నబిడ్డల్ని కానరాని వాళ్లకమ్ముకునేందుకిదో ఎత్తు అన్న మాట. అతనిది గుండెనా... బండనా!

''అంటే...'' లోపలి ఆందోళన గొంతులోకి రాకుండా జాగ్రత్త పడుతున్నాడు ''నిన్ను గూడా సింగపూర్ పంపిస్తడా?''

''ఆ... వారం రోజులల్ల ఎల్లిపోతున్న. మా నాన్న చెప్పిండు. అక్కడనే మా అక్కాబావల దగ్గరుంట. హాయిగా ఉద్యోగం చేసుకుంట'' నల్లని కళ్లల్లో కాంతిరేఖలు కదుల్తున్నాయి.

''వచ్చే సంవత్సరం మా చెల్లెను గూడ సింగపూరుకే తీసుకొస్తడటా. అందరము అక్కడనే రంది లేకుంట ఉంటము'' అల్లిన మాలను రెండుగా కత్తిరించి ఒక మాలను జడలో తురుముకుంది. దృశ్యం... కనువిందుగా వుంది.

పాపం! భవిష్యత్తు పూలబాట కావాలని బంగారు కలలు కంటోంది. ఆశల మాటున ఆశయం... అంతా బాగుండాలనేదే. భగవంతుడా! అమాయకులైన అబలల జీవితాలతో ఆడుకోవడం సరదాగా ఉందా? చెరువు నీటిలో స్వేచ్ఛగా విహరిస్తున్న చేపకు గాలానికి చిక్కుకునేదాకా తెలీదు... అత్యాశ ఆపదలకు దగ్గర చేస్తుందని - గుండె ఘోష నరాలను మెలిపెడుతోంది.

తిరిగి మాటల్లోకి దింపాడు.

భూత, భవిష్య, వర్తమానాల గురించి మాటామంతి సజావుగా సాగిపోతోంది. నిజాలు పేలిపోతున్నాయి.

***

బుధవారం ఉదయం.. ఆరున్నరైంది.

''యాదగిరి సాబ్!'' సత్తయ్య పిలుపు అరుపులాగుంది. అర్జంటు పని అప్పుడే పూర్తి చేసుకోవాలన్నట్టు దబదబా లోపలికొచ్చేశాడు. ఎదురుగా కుర్చీలో యాదగిరి... నుదుట చందనం బొట్టు, స్నాన పూజాదులు ముగించుకుని షాపు కెళ్లేందుకు తయారైనాడు. ఖాళీ కుర్చీని కళ్లతో చూపిస్తూ సత్తయ్యను కూచోమన్నాడు. ఇల్లంతా కలియజూస్తున్నాయతని కళ్లు. ఇటు సత్తయ్య కూచుంటున్నాడు

> **భగవంతుడా! అమాయకులైన అబలల జీవితాలతో ఆడుకోవడం సరదాగా ఉందా? చెరువు నీటిలో స్వేచ్ఛగా విహరిస్తున్న చేపకు గాలానికి చిక్కుకునే దాకా తెలీదు... అత్యాశ ఆపదలకు దగ్గర చేస్తుందని**

అటు యాదగిరి లేచి లోపలికెళ్లాడు. సత్తయ్యలో అనుమానం... లోలోపల గుంజాటన.. ఆలోచన...

...లోపల నుంచి పైకం పట్టుకొస్తాడు. తనకిస్తాడు. కడుపు కోతను భరిస్తూ భవానిని అమ్మెయ్యాలె. ఆ తర్వాత చిన్నకూతురు సుమతి పెళ్లి చెయ్యాలె. ముగ్గురాడపిల్లల్ని కన్నందుకు ఒక్కరి కన్నా కాళ్లు కడిగి కన్యాదానం చెయ్యాలె...

కాని యాదగిరి చాయ్ గ్లాసుల్తో తిరిగొచ్చాడు.

''ముందు చాయ్ తాగు'' గ్లాసు అందించాడు.

చాయ పొగలు కక్కుతోంది. వేడి చాయ్. ప్రాణం లేచొచ్చింది. ఆబగా పెదాలకానించుకున్నాడు. చాయ... కమ్మగా, తియ్యగా... జరజరా నరాల్లోకి పాకుతోంది ఉత్సాహం, ఉల్లాసం ఉరుకులాడుతున్నాయి. ఖాళీ గ్లాసు టీపాయ్ ముందుంచుతూ

''గా... పైకం సంగతి...!'' సిగ్గు, బిడియాన్ని పక్కకు నెట్టేస్తూ ధైర్యంగా అడిగాడు. యాదగిరి చూపులదోలా ఉన్నాయి

''మీ భవానిని నువ్వే తీస్కపోయి అమ్మేస్తవా లేక మధ్యవర్తుల ద్వారా అమ్మిస్తవా?''

బోడిగుండుకు ఒడిశెలగుండు తాకినట్టు - ఝల్లుమంది సత్తయ్యకు. ప్రశ్న అంత సూటిగా దూసుకొస్తుందనుకోలేదు... ఆహా! నా పిల్లల పేర్లు గుర్తున్నాయన్నమాట! హుషారు పిట్టనే!

''మా దోస్త్ హైదరాబాదులున్నడు. అతడే అమ్మేస్తడు. చాలా నమ్మకస్తుడులే''

''అమ్ముడు పోయేందుకు భవాని ఒప్పుకుందా?''

''గదంతా నేం జూసుకుంట గదా'' సత్తయ్యలో అసహనం అంగలేసింది. ''ఇంతకుముందు సుశీలను అమ్మేసినగదా, గట్లనే...''

''అట్లనా! అయితే చిన్న బిడ్డ సుమతినెప్పుడు అమ్మేస్తవు?''

అది కోపమో, సానుభూతో అర్థంకాలేదు.

''హబ్బా! గవన్నీ అడుగుతే ఎట్లా యాదగిరి సాబ్? ఓ పూట తింటే ఇంకో పూటకు లేనోణ్ణి...'' చేతులు జోడించాడు. వెన్నుపూసలోని వణుకు చేతుల నుండి వేళ్లదాకా పాకింది.

''సరే కూచో! నా భార్యతో పంపిస్తా'' నంటూ లోపలికెళ్లాడు యాదగిరి. సత్తయ్య బిత్తరపోయాడు.

యాదగిరికి పెళ్లెప్పుడైంది. ఎప్పుడూ అనలేదు... మూడు నిమిషాలు.. మూడు రోజుల్లా గడిచాయి. సత్తయ్యలో బెదురు... లోపలినుండి సెల్‌ఫోన్ చేసి పోలీసుల్ని పిలిపిస్తున్నడేమో... ఒళ్లంతా చెమట పట్టేస్తోంది. ఊహు! ఇక్కడుంటే చిక్కులొస్తయ్. పైకం సంగతి దేవుడెరుగు, పోలీసులు బొక్కలదోసి బొక్కలిరగ్గొడ్తరు... గబుక్కున లేచాడు. దబదబా వెళ్లబోయాడు.

''ఇగో పైకం..!'' ఆడగొంతు. వెనక్కు తిరిగాడు. కళ్లు జిగేల్‌మన్నాయి. ఒళ్లు జలదరించింది. భవాని... తన కూతురు భవాని. చేతిలో వంద రూపాయల నోట్లు... కళ్లు నులుముకుని ఎగాదిగా చూస్తున్నాడు. గులాబి రంగు పీతాంబరం, మెడలో మంగళసూత్రం, సాయపసుపు పూతతో మొహం వెలిగిపోతోంది. కనుబొమ్మల మధ్య కుంకుమబొట్టు... అచ్చం భవానీమాత లాగుంది... ''తీసుకో నాన్నా''!

ఆశ్చర్యం, ఆనందం, నవనాడుల్లో ఉద్విగ్నం... మనసనే మామిడి తోటలో కోయిల కూస్తున్నట్టుంది. సత్తయ్య పెదాలు వణుకుతున్నాయి. గుండె మూలల్లో గుబగుబలు...

''భవానీ... నా తల్లీ.. నువ్వేనా?'' వచ్చి ముందునుంచున్నాడు.

''అవును నాన్నా. మూడ్రోజులైంది నా పెండ్లయి. ఈ పైకంతోని సుమతిని అమ్ముకరావద్దు నాన్నా! చెల్లె నాతోనే వుంటుంది'' అంటూ చెయ్యి లాగి, నోట్లు.. వెయ్యి రూపాయలు చేతిలో ఉంచింది. కాటుక కళ్లు ఊట చెలమలల్లాగైనాయి. ఊరిన నీరు చెంపల మీద ధారలై వక్షస్థలాన్ని తడిపేస్తోంది.

సత్తయ్య అంతరాళాల్లో జడివాన కురుస్తోంది.

''అమ్మా... భవానీ!'' గుండె గోడల్ని చీల్చుకుంటూ వచ్చిందా పిలుపు. ఎదలో పొంగిన అష్టమ సముద్రం కెరటాలు కళ్లలో గంతులేస్తున్నాయి. నోట్లు జారి నేలమీద పడ్డాయి. కన్నీటి బిందువుల్ని మోస్తున్న కరెన్సీ నోట్లకు అటువైపు భవాని, ఆమె వెనుక యాదగిరి, ఇటువైపు సత్తయ్య, అతని పక్కన సుమతి... ఒకరి గుండె చప్పుళ్లు ఇంకొకరికి వినబడుతున్నాయి.

★